ప్రజ రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
1
RNI No: APTEL/2023/87888
సోమవారం
22 సెప్టెంబర్ 2025



# క్వాంటమ్ టెక్నాలజీపై మరింత దృష్టి:ఏపీ సీఎం చంద్రబాబు

**విశాఖ, సెప్టెంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** సంకల్పం ఉంటే మంచి పనులు ఎన్ని అయినా చేయవచ్చని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖలో 28వ ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. డిజిటల్ ఏపీ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "సరైన సమయంలో సరైన నాయకుడిగా ప్రధాని మోదీ వచ్చారు.

ప్రజలకు మేలు జరిగే నూతన సంస్కరణలు తీసుకొచ్చారు. సాంకేతికతకు అనుగుణంగా మనమూ మారాల్సిన అవసరముంది. ఇవాళ ప్రజలకు అన్ని సేవలు ఆన్లైన్లోనే అందుబాటులోకి వచ్చాయి.ఐటీ రంగంలో భారతీయులకు చాలా నైపుణ్యం ఉంది. నాలెడ్జ్ ఎకానమీకి ఆనాడు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే హైదరాబాద్కు మేలు జరిగింది. తలసరి ఆదాయంలో తెలంగాణ ప్రముఖంగా మారింది. ఇవాళ ప్రపంచంలో ఎక్కడ చూసినా భారతీయులే ఉన్నారు. ఐటీ సంస్థల్లో పనిచేస్తున్న భారతీయుల్లో దాదాపు 30 శాతం ఏపీ వారే. ప్రపంచంలోని నలుగురు ఐటీ నిపుణుల్లో ఒకరు భారత్కు చెందినవారు ఉన్నారు. భారతీయ ఐటీ నిపుణులు ప్రతి నలుగురిలో ఒకరు ఏపీకి చెందినవారే కావడం విశేషం. ప్రముఖ సంస్థల సహకారంతోనే అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఐబీఎం, టీసీఎస్ వంటి సంస్థలు వస్తున్నాయి. క్వాంటమ్ టెక్నాలజీపై మరింత దృష్టి పెడుతున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

# విజయవాడ దుర్గమ్మ

## దర్శనానికి 20లక్షల మంది వస్తారని అంచనా:మంత్రి అనిత

**విజయవాడ, సెప్టెంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** నగరంలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ నేడు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. దసరా ఉత్సవాల తొలిరోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు.



దుర్గమ్మను ఏపీ మంత్రులు వంగలపూడి అనిత , ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్బాబు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.దర్శనం అనంతరం అనిత మీడియాతో మాట్లాడారు. తెలుగు ప్రజలందరికీ ఆమె దసరా ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. అంగరంగ వైభవంగా అమ్మవారి దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. భక్తుల కోసం తగిన ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. మొత్తం 36 విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారని.. 4,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు."గతేడాది దసరా నవరాత్రుల్లో 13 లక్షల మంది భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ ఏడాది సుమారు 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం. వీఐపీలకు ప్రత్యేక స్లాట్ ఏర్పాటు చేశాం.. ఆ సమయంలో వారు దర్శనం చేసుకుంటారు. వీఐపీ భక్తులు దర్శనానికి వచ్చినా.. సామాన్యులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాం. వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాం. స్త్రీ శక్తి పథకం వల్ల ఉచిత బస్సుల్లో చాలా మంది మహిళలు వస్తారని ఆశిస్తున్నాం. రాబోయే సంవత్సరాల్లోనూ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీయే ప్రభుత్వమే ఉండాలని అమ్మవారిని కోరుకున్నా. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్కు శక్తిని, యుక్తిని, ధైర్యాన్ని ఇవ్వాలని వేడుకున్నా. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించాను" అని అనిత తెలిపారు.

# ప్రభుత్వ బడుల్లో 'నో అడ్మిషన్' బోర్డు పెట్టాలనేదే నా లక్ష్యం :మంత్రి నారా లోకేశ్

**అమరావతి, సెప్టెంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** 'మన బడి-మన భవిష్యత్తు' కార్యక్రమం కింద విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల నియామకం, గదుల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.



ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం అంశంపై శాసనసభలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు."యువగళం పాదయాత్ర సందర్భంగా ఉపాధ్యాయులు పలు సమస్యలను నా దృష్టికి తీసుకొచ్చారు. ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలనేది మా లక్ష్యం. పాఠశాల భవనాల నిర్మాణం కోసం దాతల సహకారం కోరుతున్నాం. భవనాలపై దాతల పేర్లు ఉండేలా చూస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు రావాలనేది మా ఉద్దేశం. అన్ని ప్రభుత్వ బడుల్లో సీట్లు నిండి 'నో అడ్మిషన్' బోర్డులు పెట్టాలనేదే నా లక్ష్యం. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు వంద బడుల్లో అలాంటి పరిస్థితి ఉంది" అని మంత్రి లోకేశ్ తెలిపారు.

# సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. లాభాల్లో 34 శాతం కార్మికులకు పంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో కార్మికుడికి బోనస్ రూ.1,95,610 ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు వెల్లడించారు.



## రిపబ్లిక్ సినిమా

# ప్రశాంత్ వర్మ సర్‌ప్రైజ్.. సూపర్ హీరో ఫిల్మ్స్ 'అధీర' అప్డేట్



తన సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయూ) నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా వస్తుందని దర్శకుడు ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా పీవీసీయూలో రానున్న 'అధీర'పై ఆయన అప్డేట్ ఇచ్చారు. ఇందులో ఎస్.జే.సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు. 'ప్రపంచాన్ని చీకటి కమ్మేసినప్పుడు.. వెలుగు రూపంలో ఆశాకిరణం పుట్టుకొస్తుంది' అంటూ 'అధీర' నుంచి ఆసక్తికర పోస్టర్ను పంచుకున్నారు. ప్రశాంత్వర్మ సినిమాటిక్ యూనివర్స్లో భాగంగా ఈ సూపర్ హీరో ఫిల్మ్ రానున్నట్లు తెలిపారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు వెల్లడించారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. తన సినిమాటిక్ యూనివర్స్కు సంబంధించి ప్రస్తుతం 20 స్క్రిప్టు సిద్ధమవుతున్నాయని.. తొలి ఫేజ్లో ఆరుగురు సూపర్ హీరోల సినిమాలు తీస్తామని గతంలో ప్రశాంత్ వర్మ వివరించారు. ఇందులోభాగంగా ఇప్పటికే 'మహాకాళీ'ని ప్రకటించారు. 'మా యూనివర్స్కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించనున్నాం' అని 'మహాకాళీ'ని పరిచయం చేశారు. ఇప్పుడు ఈ 'అధీర' గ్లింప్స్ను 'ఓజీ' సినిమాలో చూపించాలని ప్లాన్లో ఉన్నట్లు సమాచారం.

## రిపబ్లిక్ స్పోర్ట్స్

# ఆ క్యాచ్ ఔట్ నిర్ణయం సరైందే.. ఇదిగో సాక్ష్యం!




భారత్తో మ్యాచ్లో పాకిస్థాన్ ఓపెనర్ ఫకర్ జమాన్ ఔట్పై రాద్ధాంతం మొదలైంది. టీమ్ ఇండియా చేతిలో ఓటమికి కారణాలను వెతికే పాక్ మాజీలకు ఇదొక అస్త్రమైంది. అంపైరింగ్ వ్యవస్థ భారత్కు అనుకూలంగా ఉందని విమర్శలు గుప్పించినవారూ లేకపోలేదు. అయితే, పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా మాత్రం పైకి బాగానే స్పందించినా.. పరోక్షంగా అంపైర్లూ పొరపాట్లు చేస్తారంటూ పేర్కొన్నాడు. థర్డ్ అంపైర్ నిర్ణయం సరైందే అంటూ ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

### ఇదీ జరిగింది

మూడో ఓవర్ లో హార్దిక్ పాండ్య వేసిన బంతిని ఆడబోయిన ఫకర్ జమాన్ (15) వికెట్ కీపర్ సంజు శాంసను క్యాచ్ ఇచ్చాడు. అయితే, క్యాచ్పై స్పష్టత లేకపోవడంతో ఫీల్డ్ అంపైర్లు థర్డ్ అంపైర్ను ఆశ్రయించారు. వివిధ కోణాల్లో చూసిన థర్డ్ అంపైర్ చివరికి ఔట్గా ప్రకటించాడు. అప్పటికీ జమాన్ అసహనంతోనే మైదానం వీడాడు. ఒకవేళ అతడు క్రీజ్లో ఉండుంటే తమ స్కోరు కనీసం 190 వరకు వెళ్లేదని కెప్టెన్ సల్మాన్ అఘా వ్యాఖ్యానించాడు. షోయబ్ అక్తర్, మిస్బాఉల్ హక్ వంటి మాజీలు అంపైర్ నిర్ణయం తప్పు అంటూ వ్యాఖ్యలు చేశారు. మొత్తం 26 కెమెరాలను చూపించే ధైర్యం ఐసీసీకి ఉందా? అంటూ ప్రశ్నించారు. కానీ, తాజా వీడియో ప్రకారం.. బంతి కిందే సంజుశాంసన్ గౌవ్స్ ఉన్నట్లు తెలుస్తోంది. థర్డ్ అంపైర్ నిర్ణయం సరైందేనని తేలిపోయింది.

# ఇంటి చిట్కాలు

నిమ్మకాయలు.. సీజన్తో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వీటిని వాడతారు. అందుకోసమే ఇంట్లోనే ఈ చెట్లని పెంచుతారు. ఈ చెట్లని పెంచేటప్పుడు కొన్ని టిప్స్ ఫాలో అయితే ఎక్కువగా నిమ్మకాయలు కాస్తాయి. అవేంటంటే



ఆహారానికి రుచి పెంచాలన్నా, అలసిన శరీరానికి రీఫ్రెష్‌మెంట్ ఫీల్ కావాలన్నా, ఆరోగ్యాన్ని కాపాడాలన్నా, బరువు తగ్గించాలన్నా.. ముందు వరుసలో ఉండేవాటిలో నిమ్మకాయలు కూడా ఉన్నాయి. వీటిని మనం ఎలా అయినా వాడతాం. ఇంట్లో నిమ్మకాయలు ఉంటే జ్యూస్‌లు చేసి వాడతాం. ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో కలిపి తాగుతాం. నిమ్మ పులిహోర చేస్తాం, నిమ్మతో ఎన్నో రకాల వంటలు చేస్తాం. వీటన్నింటికోసమే చాలా మంది ఇంట్లోనే నిమ్మచెట్లని పెంచుతారు. దీంతో అవసరం ఉన్నప్పుడల్లా నిమ్మకాయల్ని కోసుకోవడానికి.

అయితే, నిమ్మ చెట్లని పెంచినా కొన్నిసార్లు చెట్లకి అనుకున్నంతగా కాయలు రావు. పూత సరిగా ఉంటుంది. కాయలు ఎక్కువగా రావు. అలా కాకుండా చెట్టు నిండా నిమ్మకాయలు రావాలంటే ఎలాంటి టిప్స్ ఫాలో అవ్వాలో తెలుసుకోండి.

## నిమ్మ చెట్లకి ఎక్కువగా కాయలు కాయాలంటే ఏం చేయాలి, ఎలాంటి టిప్స్ ఫాలో అవ్వాలి




### ఏం నాటుతున్నారు



చాలా మంది నిమ్మ చెట్లని నర్సరీ నుంచి తెచ్చుకుంటారు. లేదంటే పండిన పండ్ల నుంచి నిమ్మ గింజల్ని తీసి ఆరబెట్టి పెడుతుంటారు. ఎలా అయినా కూడా నిమ్మ చెట్లు నాటుకుంటాయి. అయితే వాటిని చక్కగా పెంచడానికి మరికొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. నిమ్మచెట్టుని పెంచుకోవాలనుకుంటే మనకి పెద్ద తొట్టి అవసరం. చిన్న వాటిలో చెట్లు అంత త్వరగా పెరగవు. కాబట్టి, మనకి పెద్ద తొట్టిని తీసుకోవాలి. కారణం, నిమ్మ చెట్ల వేర్లు, కొమ్మలు చాలా విస్తృతంగా పెరుగుతాయి. నేలలో నాటితే మంచివి. అలా కాకుండా తొట్టిలో నాటుకోవాలనుకుంటే పెద్ద పెద్ద తొట్టిలు అవసరం. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోండి.

### నేలలో నాటితే



మనం నిమ్మ చెట్లని నేలలో నాటితే మనం వాటి చుట్టూ కాస్త ప్లేస్ వదిలేయాలి. దీనికి కారణం వేర్లు చాలా ఎక్కువగా విస్తరిస్తాయి. కాబట్టి, చుట్టూ కాస్త దూరం వరకూ చెట్లని నాటొద్దు. వేర్లు చక్కగా విస్తరిస్తాయి. చెట్టు సరిగా పెరుగుతుంది.

### పెద్ద తొట్టి



నిమ్మచెట్టుని పెంచుకోవాలనుకుంటే మనకి పెద్ద తొట్టి అవసరం. చిన్న వాటిలో చెట్లు అంత త్వరగా పెరగవు. కాబట్టి, మనకి పెద్ద తొట్టిని తీసుకోవాలి. కారణం, నిమ్మ చెట్ల వేర్లు, కొమ్మలు చాలా విస్తృతంగా పెరుగుతాయి. నేలలో నాటితే మంచివి. అలా కాకుండా తొట్టిలో నాటుకోవాలనుకుంటే పెద్ద పెద్ద తొట్టిలు అవసరం. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోండి.

### సహజ ఎరువులు



ఈ చెట్లు చక్కగా పెరగడానికి సహజ ఎరువులు వాడాలి. అవి ఆవు పేడ, పొటాషియం ఉన్న సహజ ఎరువులని మాత్రమే వాడాలి. 60 శాతం పిట్ నాచు, 40 శాతం కంపోస్ట్‌ని కలపండి. వీటితోనే చెట్లు చక్కగా పెరుగుతాయి. ఇంట్లో మనం వంట చేసేటప్పుడు వచ్చే వ్యర్థాలన్నింటిని కూడా వేయొచ్చు.

### ఎండ తగిలేలా



అదే విధంగా, కొన్ని చెట్లకి ఎండ అవసరం లేదు. కానీ, నిమ్మ చెట్లకి ఎండ ఎంత ఎక్కువగా ఉంటే అంత బాగా పెరుగుతాయి. కాబట్టి, ఎండ చక్కగా పడేలా చూడండి. దీంతో చెట్లు బాగా పెరుగుతాయి. గాలి కూడా వీచే ప్రదేశంలోనే చెట్లని పెంచండి. అదే విధంగా, ఈ చెట్లకి మీరు ప్రతి 2, 3 రోజులకి ఓ సారి నీరు పోయండి. ఇలా పోసినప్పుడల్లా చెట్లు చక్కగా తడిచేలా చూడండి. నీటి వల్లే చెట్లు చక్కగా పెరుగుతాయని గుర్తుంచుకోండి.